www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 55 | 4-8-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జిలకు గ్రీన్‌సిగ్నల్

- న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంపు
- విపక్షాల ఆందోళనల మధ్య చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదం
- పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారమే లక్ష్యమన్న కేంద్రం

2





## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

- వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే
- రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

2

## సహజీవనం కూడా చట్టబద్ధమే!

- భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష
- సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

4

సహజీవనం అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది.




## నిమ్స్‌లో రొబోటిక్ సర్జరీల కొత్త చరిత్ర

- రెండున్నరేళ్లలోనే 1,000 శస్త్రచికిత్సలు పూర్తి
- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్, మంత్రి దామోదర రాజనర్సింహ
- 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచిత చికిత్సలు

2





## సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై స్పెషల్ ఫోకస్

- ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులే లక్ష్యం
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి, గౌరవెల్లికి అత్యధిక ప్రాధాన్యం
- సుప్రీంకోర్టు తీర్పుతో కొత్త అవకాశాలు..
- అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం

తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి

రాష్ట్రంలోని 4 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు రాబోయే ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యావరణ అనుమతుల అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు తెలంగాణ ప్రాజెక్టులకు న్యాయపరమైన స్పష్టతనిచ్చిందని తెలిపారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ మరియు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

- ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా
- 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

2



## సింగరేణికి కొత్త ఊపిరి

ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి లభించిందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం చారిత్రక విజయమని అభివర్ణించారు. సింగరేణి పరిరక్షణ, విస్తరణతో పాటు తెలంగాణ ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గత 30 నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని అమెరికా పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో తెలిపారు.

3



- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ కైవసం
- ఏటా 60 లక్షల టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గు వెలికితీత
- రెండు వేల మందికి ఉపాధి భద్రత.. మణుగూరు ప్రాంతానికి మరో 20 ఏళ్ల భరోసా
- ప్రజా ప్రభుత్వ కృషితోనే చారిత్రక విజయం: భట్టి విక్రమార్క



## బీజేపీ కంచుకోటలో పీకే జెండా

- బంకీపూర్ ఉపఎన్నికలో సంచలన విజయం
- 30 ఏళ్ల కమలం కోట బద్దలు.. బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు
- బిహార్, మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ.. గుజరాత్‌లో పరువు నిలుపుకున్న కమలం

4



## విద్యార్థుల బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం

- పెండింగ్ నిధులను విడుదల చేయాలి
- సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగిస్తాం: ఆర్. కృష్ణయ్య

3

## నిరుద్యోగులను నట్టేట ముంచిన రేవంత్

- యువత జీవితాలతో ఆటలు
- యూత్ డిక్లరేషన్‌లోని 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- జాబ్ క్యాలెండర్‌కే విలువ లేకుండా చేశారు: కేటీఆర్

3



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక





# ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

## వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే

## రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 3:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

# జోగినిలకు గుర్తింపు కార్డులు

## లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## జోగినిల సంక్షేమానికి ప్రభుత్వం అండ: మంత్రి పొన్నం

## మహంకాళి ఆలయం వద్ద జోగినిల ఆందోళన..

**హైదరాబాద్, ఆగస్టు 3:** లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లాల్‌దర్వాజ బోనాల ఏర్పాట్లపై మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జోగినిలు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. వారికి అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు, మున్సిపల్ ఎన్నికల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారికి సేవలందించే జోగినిల సంక్షేమానికి మూడు శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద జోగినిలు సోమవారం ఆందోళనకు దిగారు. బోనాల సందర్భంగా తమను ఆలయ సిబ్బంది, పోలీసులు అవమానించారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. జోగిని శ్యామల మాట్లాడుతూ, అవసరం వచ్చినప్పుడే ప్రభుత్వం జోగినిలను గుర్తు చేసుకుంటోందని విమర్శించారు. బోనాల సందర్భంగా కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. ఉదయం నుంచే ఆలయ గేట్ల వద్ద పోలీసులు జోగినిలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. బ్యారికేడ్లు తొలగించుకుని జోగినిలు ఆలయంలోకి ప్రవేశించగా, ఆలయం ముందు కొంతసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా రంగం కార్యక్రమం కూడా ఆలస్యంగా ప్రారంభమైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు జోగినిలతో సమావేశమై వారి సమస్యలను విన్నారు. ప్రభుత్వం వారి డిమాండ్లను పరిశీలిస్తుందని హామీ ఇవ్వడంతో జోగినిలు ఆందోళన విరమించారు.

# ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

## తుపాకీ లాక్కుని పారిపోతుండగా కాల్పులు

**రాంచీ, ఆగస్ట్ 3:** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తాము కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై స్పెషల్ ఫోకస్

- ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులే లక్ష్యం
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి, గౌరవెల్లికి అత్యధిక ప్రాధాన్యం
- సుప్రీంకోర్టు తీర్పుతో కొత్త అవకాశాలు..
- అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్టు 3:** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంత వరకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పర్యావరణ అనుమతుల అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు రాష్ట్రానికి న్యాయపరమైన స్పష్టతను కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. గతంలో చట్టబద్ధంగా అనుమతులు పొందిన ప్రాజెక్టులకు రక్షణ కొనసాగుతుందని, తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను సాంకేతిక లోపాలు సరిచేసి అవసరమైతే తిరిగి సమర్పించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల కోసం సాగించిన న్యాయపోరాటం వల్లే ఈ అనుకూల పరిస్థితి ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, దానిని సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర, అనుమతులు, రీడిజైన్‌లు, న్యాయపరమైన అంశాలు, పెండింగ్ కేసులు, సాంకేతిక వివరాలన్నింటినీ ఒకే సమగ్ర దస్త్రంలో సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, ఏడు రోజుల్లో అన్ని రికార్డులు సేకరించాలని, 30 రోజుల్లో పర్యావరణ అధ్యయనాలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధాన పరిపాలనా ప్రక్రియతో పాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణను 60 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన మంత్రి, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో వినియోగానికి సిద్ధంగా ఉంచాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపుల తనిఖీలు, మరమ్మతులు, కాలువల పరిశీలన, నీటి ప్రవాహానికి అడ్డంకుల తొలగింపు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ పత్రాలను నవీకరించి, అనుమతులు లభించిన వెంటనే పనులు పునఃప్రారంభించేలా టెండర్లు, ఇంజినీరింగ్ ప్రణాళికలు ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసుల విషయంలో న్యాయ సలహాదారులు, శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. న్యాయస్థానాల్లో విచారణకు ముందే అన్ని సాంకేతిక నివేదికలు, కౌంటర్ అఫిడవిట్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. తెలంగాణలోని గ్రామాలు, భూములు, ప్రజా ఆస్తులపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విశ్వసనీయ క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, ఆర్థిక అంచనాల ఆధారంగా తెలంగాణ వాదనను కేంద్రం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముందు బలంగా వినిపించాలని సూచించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పోలవరం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని స్పష్టంగా అంచనా వేయాలని అన్నారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించే బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని స్పష్టం చేశారు. పరిహార దావాలకు అవసరమైన అంచనాలను త్వరగా పూర్తి చేసి, అధికారికంగా కేంద్ర సంస్థల ముందు ఉంచాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.

# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

## ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా



**హైదరాబాద్, ఆగస్ట్ 3:** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జిలకు గ్రీన్‌సిగ్నల్

- న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంపు
- విపక్షాల ఆందోళనల మధ్య చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదం
- పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారమే లక్ష్యమన్న కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కు పెంచేందుకు జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య (సవరణ) బిల్లు--2026ను సభ ఆమోదించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, రామమందిర విరాళాల వ్యవహారాలపై విపక్ష సభ్యులు నినాదాలతో నిరసన వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో బిల్లుపై ఎలాంటి చర్చ జరగకుండానే స్పీకర్ ఓం బిర్లా దానిని ఓటింగ్‌కు పెట్టగా, సభ ఆమోదం తెలిపింది. ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు. సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, పెరుగుతున్న కేసుల భారం, న్యాయ విచారణ వేగవంతం చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయమూర్తుల సంఖ్య పెంపు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులను మాట్లాడాలని స్పీకర్ కోరినా, విపక్షాల ఆందోళనలు కొనసాగడంతో చర్చ జరగలేదు.

### పెండింగ్ కేసుల పరిష్కారానికి దోహదం

బిల్లు ఆమోదంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో దాదాపు లక్ష కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏడాదికి సుమారు 65 వేల కేసులు పరిష్కారమవుతున్నప్పటికీ 75 వేల వరకు కొత్త కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో న్యాయమూర్తుల సంఖ్య పెంపు ద్వారా కేసుల విచారణ వేగవంతమై ప్రజలకు త్వరితగతిన న్యాయం అందే అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంచినట్లు రఘునందన్ రావు గుర్తు చేశారు. న్యాయవ్యవస్థ ఆధునికీకరణకు కేంద్రం ఇప్పటికే వేల కోట్ల రూపాయలు వెచ్చించిందని పేర్కొన్నారు. కొలీజియం వ్యవస్థలో మరింత పారదర్శకత అవసరమని, భవిష్యత్తులో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చేసిన తాజా వ్యాఖ్యలను కూడా స్వాగతిస్తూ, న్యాయవ్యవస్థలో సంస్కరణల దిశగా కేంద్రం చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నిమ్స్‌లో రొబోటిక్ సర్జరీల కొత్త చరిత్ర

- రెండున్నరేళ్లలోనే 1,000 శస్త్రచికిత్సలు పూర్తి
- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్, మంత్రి దామోదర రాజనర్సింహ
- 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచిత చికిత్సలు



**హైదరాబాద్, ఆగస్టు 3:** ప్రభుత్వ వైద్య రంగంలో నిమ్స్ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్ర వైద్యరంగంలో కొత్త రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ కలిసి రొబోటిక్ సర్జరీల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవలే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన నిమ్స్, దేశంలోని ప్రముఖ అవయవ మార్పిడి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో కూడా రొబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని, నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ ఆసుపత్రులు, గాంధీ, కొత్త ఉస్మానియా ఆసుపత్రుల్లోనూ ప్రపంచస్థాయి రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగంలో 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 162 శస్త్రచికిత్సలు జరిగినట్లు తెలిపారు. వీటిలో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషమన్నారు. ఖరీదైన రొబోటిక్ శస్త్రచికిత్సలను కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలిగామని చెప్పారు. ఈ విజయానికి యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియా విభాగాలు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సమిష్టి కృషే కారణమని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సేవల విస్తరణకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రకటన విడుదల చేసి నిమ్స్ వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం ఫలిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యధిక రొబోటిక్ శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యరంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సింగరేణికి కొత్త ఊపిరి

- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ కైవసం
- ఏటా 60 లక్షల టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గు వెలికితీత
- రెండు వేల మందికి ఉపాధి భద్రత.. మణుగూరు ప్రాంతానికి మరో 20 ఏళ్ల భరోసా
- ప్రజా ప్రభుత్వ కృషితోనే చారిత్రక విజయం: భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 3:** ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి లభించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం చారిత్రక విజయమని అభివర్ణించారు. సింగరేణి పరిరక్షణ, విస్తరణతో పాటు తెలంగాణ ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గత 30 నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని అమెరికా పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కాపాడేందుకు కొత్త బొగ్గు బ్లాకులను సాధించడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇటీవల ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తిని ప్రారంభించామని, తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజును సాధించామని గుర్తుచేశారు. తాజాగా మణుగూరు పీకేఓసీ--2 డిప్‌సైడ్ బ్లాక్‌ను దక్కించుకోవడంతో నెల రోజుల వ్యవధిలో సింగరేణి రెండు చారిత్రక విజయాలు నమోదు చేసిందని పేర్కొన్నారు. ప్రారంభమవుతుందో లేదో అన్న అనిశ్చితిలో ఉన్న నైనీ బొగ్గు బ్లాక్‌కు అవసరమైన అనుమతులు సాధించేందుకు తాను స్వయంగా ఒడిశాకు వెళ్లి ప్రజాప్రతినిధులు, స్థానికులతో చర్చించానని తెలిపారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే 36 ఏళ్ల పాటు సింగరేణికి బలమైన ఆధారంగా నిలిచే నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన తాడిచర్ల-2 బ్లాక్‌ను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు జరిపి గత నెలలో మైనింగ్ లీజు సాధించిందని చెప్పారు. ఈ బ్లాక్‌లో 336 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, 45 ఏళ్ల పాటు వెలికితీసే అవకాశం ఉందని వివరించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తాజాగా నిర్వహించిన వేలంలో సింగరేణి తొలిసారిగా పాల్గొని మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను దక్కించుకుందని భట్టి తెలిపారు. గత పాలకులు సింగరేణిని వేలాల్లో పాల్గొనకుండా అడ్డుకోవడంతో రాష్ట్రంలోని విలువైన బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థలకు వెళ్లిపోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం సింగరేణి మనుగడను దృష్టిలో పెట్టుకుని వేలంలో పాల్గొనేలా నిర్ణయం తీసుకోవడంతో దాదాపు 12 ఏళ్ల తర్వాత సంస్థకు బొగ్గు బ్లాక్ దక్కిందన్నారు. మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌లో 120 మిలియన్ టన్నుల జీ-8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఏటా ఆరు మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గును వెలికితీసి తెలంగాణ విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. ఈ బ్లాక్ ద్వారా రెండు వేల మందికిపైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత లభిస్తుందని చెప్పారు. మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని కాపాడడంతో పాటు అక్కడి ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. రాబోయే 20 ఏళ్ల పాటు తెలంగాణ విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కోయగూడెం--3, సత్తుపల్లి--3 వంటి కీలక బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థలకు వెళ్లిపోయాయని భట్టి విమర్శించారు. వాటిని తిరిగి సింగరేణికి దక్కేలా కృషి చేయడమే తమ తదుపరి లక్ష్యమని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణిని మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సమకూర్చడం, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సింగరేణిని తెలంగాణకే పరిమితం చేయకుండా ఇతర రాష్ట్రాల్లోని బొగ్గు గనులు, దేశ విదేశాల్లోని కీలక ఖనిజాల అన్వేషణ, తవ్వకాల రంగాల్లోనూ విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. మణుగూరు బ్లాక్ సాధించిన సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు, కార్మికులందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

# బీజేపీ కంచుకోటలో ప్రశాంత్ కిశోర్ జెండా

- బంకీపూర్ ఉపఎన్నికలో విజయం
- 30 ఏళ్ల కమలం కోట బద్దలు.. బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు
- బిహార్, మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ.. గుజరాత్‌లో పరువు నిలుపుకున్న కమలం



**పాట్నా/న్యూఢిల్లీ, ఆగస్టు 3:** బిహార్ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఘన విజయం సాధించి, మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాన్ని కైవసం చేసుకున్నారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన ప్రశాంత్ కిశోర్ బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలికారు. కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచే ఆధిక్యంలో కొనసాగిన ప్రశాంత్ కిశోర్ చివరకు 63,203 ఓట్లు సాధించగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాకు 44,250 ఓట్లు వచ్చాయి. ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,085 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. విజయం అనంతరం స్పందించిన ప్రశాంత్ కిశోర్, ఈ ఫలితం బీజేపీ అగ్రనాయకత్వానికి ప్రజలు ఇచ్చిన స్పష్టమైన సందేశమని వ్యాఖ్యానించారు. బిహార్‌లో పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని వెంటనే పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో మార్పుకు నాంది పలుకుతుందని ఆయన అన్నారు. రాజ్యసభకు ఎన్నిక కావడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో బంకీపూర్‌లో ఉపఎన్నిక జరిగింది. 1995 నుంచి వరుసగా బీజేపీ గెలుస్తున్న ఈ నియోజకవర్గంలో కమలానికి తొలిసారి పరాజయం ఎదురుకావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### వరుస ఉపఎన్నికల్లో బీజేపీకి షాక్

బంకీపూర్ ఫలితంతో పాటు మధ్యప్రదేశ్‌లోని దతియా ఉపఎన్నికలో కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలవడంతో అధికార పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. సాధారణంగా అధికార పార్టీలకు అనుకూలంగా ఉండే ఉపఎన్నికల్లో బీజేపీ వెనుకబడటం విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గంలో విజయం సాధించడం ద్వారా బీజేపీ కొంత ఊరట పొందింది. బిహార్‌లో యువత ఓటింగ్ ధోరణి, స్థానిక రాజకీయ సమీకరణాలు, ప్రభుత్వ వ్యతిరేక భావన, పోలింగ్ శాతం తగ్గడం వంటి అంశాలు బీజేపీ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్ కిశోర్ విజయం జనసురాజ్ పార్టీకి తొలి శాసనసభ విజయంగా నిలవడంతో పాటు, బిహార్ రాజకీయాల్లో ఆయనను కీలక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# నిరుద్యోగులను నట్టేట ముంచిన రేవంత్

- ఉద్యోగాల భర్తీ పేరుతో యువత జీవితాలతో ఆటలు
- యూత్ డిక్లరేషన్‌లోని 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- జాబ్ క్యాలెండర్‌కే విలువ లేకుండా చేశారు: కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 3:** ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి విషయంలో మోసం చేసిందని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం ఏడు వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న యువతను అవమానించేలా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇంజినీరింగ్ పట్టభద్రులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. యువతపై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక్కటైనా పూర్తిగా అమలు చేసిందా అని నిలదీశారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను ప్రస్తావిస్తూ, ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా గౌరవం ఉండాలని కేటీఆర్ అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండేళ్లు గడిచినా నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఖమ్మంలో వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ప్రస్తావించిన కేటీఆర్, అతడు రాసిన లేఖ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఒక అభియోగపత్రంలా ఉందని వ్యాఖ్యానించారు. ఆ లేఖను రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కకు చేరే వరకు పంచాలని యువకుడు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో అశోక్‌నగర్‌లో నిరుద్యోగులకు హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు తెలంగాణకు వచ్చి యువతకు సమాధానం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు వెళ్లకుండా, అధికారంలో లేని రాష్ట్రాల్లో మాత్రమే రాజ్యాంగ పుస్తకంతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర యువత తీవ్ర నిరాశ, నిర్వేదంలో ఉందని కేటీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో యువతను ఉపయోగించుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరించడం కాంగ్రెస్, బీజేపీలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి సహా యువతకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కడడం సంతోషకరం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3:** డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఖఐక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థుల బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం

### పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి : ఆర్. కృష్ణయ్య

### సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగిస్తాం



**హైదరాబాద్, ఆగస్టు 3:** ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ మొత్తాలను తక్షణమే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆలస్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం చేపట్టిన హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనను ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన రాజ్యసభ సభ్యుడిగా పేర్కొంటూ అక్కడి సమస్యలపైనే మాట్లాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదని ఆర్. కృష్ణయ్య అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల విద్యా వ్యయాన్ని ప్రభుత్వం పూర్తిగా భరిస్తోందని, తెలంగాణలో మాత్రం అందుతున్న ఆర్థిక సాయం వాస్తవ ఖర్చులకు సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తెలంగాణలో కూడా పూర్తి విద్యా వ్యయాన్ని ప్రభుత్వం భరించే విధానాన్ని అమలు చేయాలని ఆర్. కృష్ణయ్య కోరారు. పెండింగ్ చెల్లింపులతో పాటు సమగ్ర సహాయ విధానంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ కస్టడీ కోరుతూ పిటిషన్

**హైదరాబాద్, ఆగస్టు 3:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏడు రోజులపాటు కస్టడీకి కోరారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. మరో ఇద్దరి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీల కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్టాలో పరిచయమైన మరో యువతికి ఉదయ్ పెళ్లి ప్రతిపాదనలు పంపినట్లు గుర్తించారు. ఆ యువతి స్టేట్‌మెంట్‌ను ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. మరోవైపు ఉప్పరపల్లి కోర్టులో ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం కోర్టు విచారణ చేపట్టనుంది. పోలీసు కస్టడీ పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# 3కోట్లు ముంచేసిన దంపతులు పరారీ

**సంగారెడ్డి, ఆగస్ట్ 3:** అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో చిట్టీల పేరుతో భారీ మోసం జరిగింది. స్థానికంగా సాయి గణేలిష్ టెక్స్‌టైల్స్ పేరుతో బట్టల దుకాణం నిర్వహిస్తున్న శిరీష.. తన భర్త సాంబశివరావుతో కలిసి కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ కాలనీలోని పలువురు మహిళలను ఆకర్షించి, వారి నుంచి విడతల వారీగా భారీ మొత్తంలో నగదు సేకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. చిట్టీల గడువు సమీపిస్తుండటంతో డబ్బులు తిరిగి ఇవ్వాల్సిన సమయంలో శిరీష, సాంబశివరావు దంపతులు తమ సొంత ఇంటిని విక్రయించి రాత్రికి రాత్రే పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో మోసపోయిన మహిళలు తీవ్ర ఆందోళనకు గురై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దంపతుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
4 ఆగస్టు 2026

## సంపాదకీయం



# హామీలతో మోసగిస్తున్న పాలకులు!

### మారుతున్న ప్రభుత్వాలు.. మారని ప్రజల కష్టాలు

ప్రభుత్వాలు మారుతున్నాయి. ముఖ్యమంత్రులు మారుతున్నారు. పార్టీ జెండాలు, నినాదాలు మారుతున్నాయి. కానీ ప్రజల సమస్యలు మాత్రం అలాగే మిగిలిపోతున్నాయి. ఎన్నికల ముందు గుప్పించే హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా మరుగున పడుతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని ఓట్లుగా మార్చుకోవడంలో చూపే చురుకుదనం, ఆ హామీల అమలులో మాత్రం కనిపించడం లేదు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లకు చేరువవుతున్నా కీలక సమస్యలపై ఇంకా స్పష్టత కనిపించడం లేదు. ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలను వెలికితీస్తామని, అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పెద్దఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు అక్రమంగా చేతులు మారాయి, ఎవరెవరు లబ్ధి పొందారు, ఎంత ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది అన్న అంశాలపై ప్రజలకు సమగ్ర సమాచారం అందలేదు. దేవాదాయ శాఖకు చెందిన వేలాది ఎకరాల భూములు అక్రమ ఆక్రమణలకు గురయ్యాయన్న ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. కొందరు వాటికి పట్టాలు సృష్టించుకుని రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూములను కాపాడలేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్ణయాత్మక చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ దేవాదాయ, ప్రభుత్వ భూముల పరిరక్షణపై పాలకులు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉంది. కాళేశ్వరం విషయంలోనూ విమర్శలు, ప్రత్యారోపణలే తప్ప ప్రజలకు ఉపయోగపడే పరిష్కారం కనిపించడం లేదు. ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవినీతి ఆరోపణలపై విచారణ జరగాల్సిందే. అదే సమయంలో ప్రజాధనంతో నిర్మించిన వ్యవస్థలో ఉపయోగించగల భాగాలను శాస్త్రీయంగా వినియోగంలోకి తీసుకురావడంపైనా దృష్టి పెట్టాలి. రాజకీయ ఆధిపత్య పోరాటంలో ప్రజల ప్రయోజనాలు బలికాకూడదు. జర్నలిస్టుల సమస్యల విషయంలోనూ ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోంది. అక్రిడిటేషన్లు, ఆరోగ్య కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి అంశాలు సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు కేటాయించిన భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. న్యాయస్థాన తీర్పులను చూపిస్తూ వేల కోట్ల విలువైన భూములను ఇతర అవసరాలకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జర్నలిస్టుల సంక్షేమం గురించి సభల్లో చెప్పే మాటలు కార్యరూపం దాల్చకపోతే వాటికి విలువ ఉండదు. అన్నింటికన్నా తీవ్రమైన సమస్య నిరుద్యోగం. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలకు సంఘీభావం ప్రకటించే రాజకీయ నాయకులు, తమ రాష్ట్రాల్లోని నిరుద్యోగుల ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. 2024 ఆగస్టు 2న అసెంబ్లీ వేదికగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ రెండేళ్లు గడిచినా అందులో పేర్కొన్న నోటిఫికేషన్లలో చాలావరకు వెలువడలేదన్న అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉంది. జాబ్ క్యాలెండర్‌కు కాలపరిమితి ముగిసిపోయినా బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు సమాధానం లేదు. యువజన డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల పరిస్థితీ ఇదే. నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డు, వడ్డీలేని రుణాలు, యువతులకు విద్యుత్ స్కూటీలు వంటి హామీలు కాగితాలపైనే మిగిలిపోయాయని యువత ఆరోపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో వేలాది నియామకాలు చేపట్టామని ప్రభుత్వం చెబుతున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన మొత్తం హామీలతో పోలిస్తే ఇంకా పెద్ద అంతరం కనిపిస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు వేలల్లో ఉన్నాయి. పాఠశాల విద్యాశాఖలో వేలాది ఉపాధ్యాయ పోస్టులు, విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర పోస్టులు, గురుకులాలు, పోలీసు, ఆర్టీసీ, అంగన్‌వాడీలు, ఎక్సైజ్, మైనారిటీ సంక్షేమ శాఖల్లో భారీగా ఖాళీలు ఉన్నట్లు వివిధ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల మంది ఉద్యోగ విరమణ పొందుతున్నా, ఆ మేరకు నియామకాలు జరగకపోవడంతో ఖాళీల సంఖ్య పెరుగుతోంది. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్యకు సమానంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. శాశ్వత ఉద్యోగాల స్థానంలో తాత్కాలిక నియామకాలే ప్రభుత్వాలకు అనుకూల మార్గంగా మారాయి. దీనికి గత ప్రభుత్వాలన్నీ బాధ్యత వహించాల్సిందే. ఇంటికో ఉద్యోగం, లక్షల నియామకాలు అంటూ గతంలో బీఆర్ఎస్ చేసిన ప్రకటనలు కూడా నిరుద్యోగుల ఆశలను నెరవేర్చలేకపోయాయి. తెలంగాణలో కేసీఆర్, రేవంత్ రెడ్డి అయినా.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జగన్ అయినా ఎన్నికల సమయంలో ప్రజలకు భారీ హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు, గత ప్రభుత్వ అప్పులు, న్యాయపరమైన చిక్కులు వంటి కారణాలను చూపుతూ అమలును వాయిదా వేస్తున్నారు. ప్రజలు మాత్రం ప్రతి ఎన్నికలో కొత్త ఆశతో ఓటేస్తూ, తరువాత మళ్లీ నిరాశలో మునిగిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో హామీ అనేది కేవలం ఎన్నికల ప్రచార నినాదం కాదు. అది ప్రజలతో చేసుకున్న ఒప్పందం. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత పాలకులపై ఉంటుంది. హామీలు నిలబెట్టుకోలేని ప్రభుత్వాలు కనీసం ప్రజలకు నిజాయతీగా పరిస్థితిని వివరించాలి. కాలపట్టిక ప్రకటించాలి. పురోగతిని వెల్లడించాలి. మాటలతో ప్రజలను కొంతకాలం మభ్యపెట్టవచ్చు. కానీ నిరుద్యోగి నిరీక్షణను, రైతు నష్టాన్ని, జర్నలిస్టు ఆవేదనను, భూమి కోల్పోయిన పేదవాడి బాధను శాశ్వతంగా దాచలేరు. ప్రభుత్వాలు మారినా పాలనా ధోరణి మారకపోతే ప్రజల విశ్వాసం క్రమంగా కరిగిపోతుంది. పాలకులు ఇప్పటికైనా హామీల రాజకీయాల నుంచి బాధ్యతాయుత పాలన వైపు అడుగులు వేయాలి.

# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

- సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్
- నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు.. మద్దతుగా ఆందోళన
- ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే




**రాంచీ, ఆగస్ట్ 3:** నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉద్ధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది.




దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీకైనట్టు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది. దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహాతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహాతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులపై కేసులు ముందుకు తీసుకెళ్లం

- సుప్రీంకోర్టుకు కేంద్రం హామీ.. ఎలాంటి బలవంతపు చర్యలు ఉండవని స్పష్టం
- హామీని తప్పకుండా అమలు చేయాలని కేంద్రానికి ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** జంతర్‌మంతర్ వద్ద గత నెల జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని కేంద్ర ప్రభుత్వం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనానికి స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ అమలు కావాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించరాదని కేంద్రాన్ని ఆదేశించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కూడా ధర్మాసనం గుర్తు చేసింది. జంతర్‌మంతర్ ఆందోళనలకు సంబంధించి ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తుపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం తన హామీని ఏ విధంగా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. మరోవైపు విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ స్పందిస్తూ, కేంద్రం ఇచ్చిన హామీ మేరకు నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మరోసారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.



# సహజీవనం కూడా చట్టబద్ధమే!

### భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష

### సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3:** సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498–ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498–ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498–ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# ప్రధానిపై వ్యాఖ్యలు చేసిన మైనర్‌కు ఊరట

- క్షమించానని మోదీ సందేశం..
- కేసు కొనసాగించబోమన్న ఢిల్లీ పోలీసులు
- జీరో ఎఫ్ఐఆర్ బదిలీ అనంతరం కీలక నిర్ణయం
- పశ్చాత్తాపం వ్యక్తం చేసిన బాలిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** నీట్ పేపర్ లీక్ నిరసనల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మైనర్ బాలికపై నమోదైన కేసును కొనసాగించబోమని ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనకు సంబంధించి తొలుత నోయిడా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అనంతరం దాన్ని ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రధాని పదవిని అగౌరవపరిచేలా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినప్పటికీ, ప్రస్తుతం మైనర్‌పై తదుపరి చర్యలు తీసుకోకూడదని నిర్ణయించినట్లు సమాచారం. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన కుమార్తె వయసు కేవలం 15 సంవత్సరాలేనని, అయితే ఎఫ్ఐఆర్‌లో పొరపాటున 25 సంవత్సరాలుగా నమోదు చేశారని



బాలిక తల్లి వెల్లడించారు. ఈ అంశాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాలిక సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసి ప్రధానికి క్షమాపణలు తెలిపింది. నిరసన కార్యక్రమంలో ఇతరుల ప్రభావానికి లోనై అలాంటి వ్యాఖ్యలు చేశానని, అది తన తప్పిదమని, ఇకపై అలాంటి పొరపాటు జరగదని పేర్కొంది. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా స్పందించినట్లు సమాచారం. తప్పుదారి పట్టిన చిన్నారులను శిక్షించడం కంటే వారికి సరైన మార్గనిర్దేశం చేయడం అవసరమని అభిప్రాయపడినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. బాలిక తల్లి మాట్లాడుతూ, తన కుమార్తెను క్షమించిన ప్రధాని గొప్ప మనసు చాటుకున్నారని అన్నారు. అయితే ఎఫ్ఐఆర్‌ను కూడా పూర్తిగా ఉపసంహరించాలని పోలీసులను కోరారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల వినియోగంపై పరిమితులు విధించాలని కూడా ఆమె సూచించారు. చిన్నారులు సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని, వారి దృష్టి చదువులపైనే ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఘటన తర్వాత తమ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వైరల్ వీడియో వెలుగులోకి వచ్చిన తర్వాత నివాసం కూడా మార్చుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. నిరసన కార్యక్రమాలకు హాజరై అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు యువతకు ఉన్నప్పటికీ, అసభ్య పదజాలం ఉపయోగించడం సమర్థనీయం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో బాలిక మైనర్ అని నిర్ధారణ అయిన నేపథ్యంలో కేసును కొనసాగించకూడదని పోలీసులు నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

**జిల్లా కలెక్టర్ కె. హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన ప్రతి వినతిని క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యువరాజ్ మార్మాట్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి ప్రజావాణి అర్జీదారుల నుండి వినతులను నేరుగా స్వీకరించారు. లింగాపూర్ మండలం పిట్టగూడ గ్రామంలో వర్షాకాలంలో తాగునీటి సరఫరా నిలిచిపోతోందని, వెంటనే తాగునీటి వసతి కల్పించాలని కోరారు. పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తక్షణ అత్యవసర సేవల కోసం '108' వాహనాన్ని అందుబాటులో ఉంచాలని దరఖాస్తు చేశారు. రెబ్బెన మండలం దేవలగూడ గ్రామంలో మూసివేసిన యూటర్న్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దానిని వెంటనే తెరవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, దహేగాం మండలం కమ్మర్‌పల్లి శివారులోని సర్వే నెం. 21 (12.2320 ఎకరాలు)లో 8 మంది వారసులు ఉన్నందున విరాసత్ హక్కుల పట్టా మార్పిడిని నిలిపివేయాలని దరఖాస్తు అందించారు. కెరమెరి మండలం సాంగ్వి గ్రామంలో 2024లో పూర్తయిన సిసి రోడ్డు పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయించాలని మొహర్లె రమేష్ కోరారు. వాంకిడి మండలం గోయాగం సరిహద్దు వద్ద నాగదేవత భీమన్న గుడి జాతీయ రహదారిలో తొలగించిన బోర్‌వెల్‌ను తిరిగి వేయించాలని విన్నవించారు.మరోవైపు, రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పుల్లుభాయి తన 3 ఎకరాల భూమిలో జాయింట్ సర్వే చేసి కొత్త పట్టా ఇప్పించాలని, గోల్లేటి గ్రామానికి చెందిన జరుపుల జుమ్లి భాయి మరణించిన తన భర్త పేరుమీద ఉన్న అటవీ భూమి హక్కు పత్రాన్ని తన పేరిట మార్చాలని కోరారు. సిర్పూర్ మండలం మహాగావ్ గ్రామానికి చెందిన రాము తనకు రైతు భరోసా నిధులు జమచేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ వివిధ శాఖలకు చెందిన అధికారులు పరస్పరం సమన్వయంతో వ్యవహరిస్తూ, ప్రజావాణి దరఖాస్తులపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**
జిల్లాలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతంగా, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో మీ -సేవా కేంద్రాల ఆధార్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అర్హులైన రేషన్ కార్డు లబ్ధి దారుల ఈ-కేవైసీ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడం అత్యంత కీలకమని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ నమోదు చేయాలని సూచించారు. ఈ-కేవైసీ కోసం మీ-సేవా కేంద్రాలకు వచ్చే ప్రజలకు సకాలంలో, పారదర్శకంగా, మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని, అవసరమైన మార్గదర్శకాలను తెలియజేస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలందించడం ప్రతి ఆధార్ ఆపరేటర్ బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా ఈ-కేవైసీ ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుందని, అధికారులు, మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు పరస్పర సమన్వయంతో పని చేసి లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజ్, డి.ఎం. జి.ప్రశాంత్, పౌర సరఫరాల శాఖ అధికారులు, మీ-సేవా కేంద్రాల ఆధార్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ కార్మికులకు 5 నెలల జీతాలు వెంటనే చెల్లించాలి

- **లేకపోతే ఆఫీసు ముట్టడి తప్పదు**
- **ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు చిరంజీవి**

**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ :**
మిషన్ భగీరథ ఎవరెస్ట్ ఏజెన్సీ కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని, పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హరిత కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు తాగునీరు అందించే కీలక బాధ్యతల్లో ఉన్న కార్మికులను ఇలా నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఐదు నెలలుగా జీతాలు రాక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్నాయని, రోజువారీ పోషణ కూడా భారం కావడంతో అమానుష స్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో మిషన్ భగీరథ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి కార్మికులందరూ సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎవరెస్ట్ ఏజెన్సీ కార్మికులు శ్రీకాంత్, జయ కృష్ణ, విజయ్ కుమార్, జితేందర్, తిరుపతి, మారుతి, ప్రతాప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లి పాలే శిశువుకు తొలి రక్షణ

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ అని హెచ్చీ శారారాణి అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట 3వ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం సెక్టార్ సూపర్వైజర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవజాత శిశువుకు తల్లి సరైన విధంగా పాలిచ్చే పద్ధతిని ప్రత్యక్షంగా ప్రదర్శించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. అక్కడ సురక్షిత వైద్య సేవలతో పాటు సుఖ ప్రసవాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్య పరిరక్షణలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సూపర్వైజర్ మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాల ద్వారా శిశువుకు రోగనిరోధక శక్తి పెరిగి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకుండా ఉండాలని వివరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారుల బరువు, ఎత్తులను పరిశీలించి, పౌష్టికాహార లోపాలేమీ లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కమల, షేక్ రహంతున్నిసా, శ్రీపాటి స్వాతి, ఏఎన్ఎం, ఆశా వర్కర్ సుజాత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తా

**ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**ఉద్యమ కెరటం, హైదరాబాద్:**
నకిరేకల్ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ వేముల వీరేశంను శాసనసభ ఆవరణలోని ఆయన కార్యాలయంలో చిన్న దినపత్రికల సంఘం రాష్ట్ర నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి వై.ఎల్ అశోక్, కోశాధికారి ఆజం ఖాన్, ఉపాధ్యక్షుడు గోళ్ళ రమేష్ శాలువాతో సన్మానించారు. రాజకీయాలలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్న, మధ్యతరహా పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు వీరేశం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రకటనలను చిన్న పత్రికలకు ఇచ్చేలా చూడాలని, కేటాయింపులో పారదర్శకత పాటించడం, పెండింగ్ బిల్లులను సకాలంలో విడుదల చేయడం, చిన్న పత్రికల ప్రతినిధులకు అసెంబ్లీ పాస్ లు మంజూరు చేయడం, చిన్న పత్రికల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం తదితర అంశాలపై విస్తృతంగా చ ర్చించారు. విన తుల ను శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, చిన్న, మధ్యతరహా పత్రికలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను చేర వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సంఘం తన దృష్టికి తీదుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి



**ఉద్యమ కెరటం, వాంకిడి :** వాంకిడి మండల ఆదివాసీ భవనంలో 9 తెగల నాయకుల సోమవారం అత్యవసర సమావేశం జరిగింది. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండలవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించి, సంప్రదాయ దుస్తులు, తుడుం దెబ్బలు, డోలు వాయిద్యాలు, జానపద నృత్యాలు మరియు ర్యాలీలతో పండుగ వాతావరణంలో వేడుకలు జరపాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంస్కృతి, హక్కులు, ఆత్మ గౌరవాన్ని చాటిచెప్పేలా ప్రతి కుటుంబం, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# అవగాహనతోనే టీబీ రహిత సమాజం



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** అవగాహనతోనే టీబీ రహిత సమాజం సాధ్యమని జిల్లా ఆరోగ్య శాఖకు చెందిన అబ్దుల్ ఖాదర్ అన్నారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీబీ ముక్తి భారత్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్షయవ్యాధి (టీబీ) లక్షణాలు, వ్యాధి నివారణ చర్యలు, సకాలంలో పరీక్షలు చేయించుకోవడం, పూర్తి స్థాయిలో చికిత్స పొందడం, పోషకాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. టీబీని ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యుల సూచనల మేరకు పూర్తి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం బోథ్ మండలంలోని మందబొగుడ గ్రామానికి చెందిన 15 మంది గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ నూతన సభ్యులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే తాము పార్టీలో చేరుతున్నట్లు నూతన సభ్యులు తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, అందురు సర్పంచ్ పృథ్వీ, నక్కలవాడ సర్పంచ్ నవీన్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోత రెడ్డి, నాయకులు జాదవ్ ఉమేష్, సుభాష్, మురళి, సంజీవ్, రమేశ్, సద్దాం, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులకు ఈ-కేవైసీ తప్పనిసరి

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జంగం గ్రామంలో రేషన్ కార్డు లబ్ధిదారులు తమ రేషన్ కార్డులకు ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని రేషన్ డీలర్ గోపినాథ్ సూచించారు. ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు భవిష్యత్తులో రేషన్ బియ్యంతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. జంగం గ్రామానికి చెందిన రేషన్ కార్డు సభ్యులందరూ తమ ఆధార్ కార్డుతో రేషన్ దుకాణానికి హాజరై వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు ప్రతి లబ్ధిదారుడు ఈ ప్రక్రియను పూర్తి చేయడం అవసరమని పేర్కొన్నారు. దీంతో సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా కొనసాగడంతో పాటు అర్హులైన వారికి ఎలాంటి అంతరాయం లేకుండా ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందని వివరించారు.



# ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రీ ప్రైమరీ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో జిల్లాలోని 118 ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలలలో పని చేస్తున్న ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లకు ఏర్పాటు చేసిన 4 రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో తొలి 5 సంవత్సరాల కాలం అత్యంత కీలకమైనవని, ఈ దశలో అందించే విద్య వారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో ప్రీ-ప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు పిల్లలతో ప్రేమ, ఆప్యాయత, ఓర్పుతో వ్యవహరిస్తూ ఆటల ద్వారా నేర్పించడం, పాటలు, కథలు, సంభాషణలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా అభ్యాసనాన్ని ఆనందదాయకంగా మార్చాలని సూచించారు. ప్రతి చిన్నారిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, వారి సమగ్ర వికాసానికి కృషి చేయాలని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ విద్యను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, జిల్లాలో ప్రీ-ప్రైమరీ విద్యను మరింత నాణ్యంగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఇన్స్ట్రక్టర్లు సమిష్టిగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, కేంద్ర ఇంచార్జ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేశ్వర్, రిసోర్స్ పర్సన్ శంకర్, చౌదరి వెంకటేష్, ఝాన్సీ రాణి, వెంకటేష్ జిల్లాలోని ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

# నకిలీ ధ్రువపత్రాల గ్యాంగ్ గుట్టు రట్టు

## ఆరుగురిపై కేసు, ఐదుగురు అరెస్ట్





అరెస్టు చేసిన నిందితులు..

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ రికార్డులను నకిలీవిగా సృష్టించి, ప్రజలను, ప్రభుత్వాన్ని మోసగిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్ హెడ్క్వార్టర్స్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను వెల్లడించారు. గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి మహ్మద్ లుక్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి పేరుతో నకిలీ రబ్బర్ స్టాంపు తయారు చేసి, ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేశారు. కంప్యూటర్ల ద్వారా నకిలీ జనన, మరణ, వివాహ ధ్రువపత్రాలు, ఇంటి పన్ను ధ్రువపత్రాలు వంటి గ్రామపంచాయతీ పత్రాలను సృష్టించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా ఆధార్ కార్డులు, ఓటర్ గుర్తింపు కార్డులు, పాన్ కార్డులను తయారు చేసి, అనర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చేస్తూ తెలంగాణ ప్రభుత్వాన్ని మోసగిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్ పరికరాలు, నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ల్యాప్టాప్లు, కంప్యూటర్ సీపీయూలు, మానిటర్లు, ప్రింటర్లు, హార్డ్డిస్క్లు, మొబైల్ ఫోన్లు, సిఎంఐ టెక్, లాజిటెక్ వెబ్ కెమెరాలు, సుప్రీమా రియల్స్కాన్-జీ10 ఫింగర్ప్రింట్ స్కానర్, నకిలీ రబ్బర్ స్టాంపులు, నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు,ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబ్ కు పంపి, మరింత సమాచారం సేకరించనున్నట్లు తెలిపారు. నిందితులు ఇప్పటివరకు ఎంత మందికి నకిలీ పత్రాలు జారీ చేశారు, ఇంకెవరైనా భాగస్వాములు ఉన్నారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

ఇచోడ మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన షేక్ హరూన్, ఇచ్చోడ మండలకేంద్రానికి చెందిన అబ్దుల్ షఫీక్, షేక్ దిల్షాద్ అహ్మద్, అబ్దుల్ రహమాన్ ఖాన్, సయ్యద్ నౌషాద్ లను అరెస్ట్ చేయగా, నిందితుడు అబ్రార్ అలీ పరారీలో ఉన్నాడు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఇచ్చోడ సీఐ కె.నరేష్ కుమార్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్టీ హోదా సాధనకు ఉద్యమం ఉధృతం

- కాగజ్నగర్లో తెలంగాణ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం
- ఢిల్లీ లో జంతర్ మంతర్ నిరసన విజయవంతానికి కార్యాచరణపై చర్చ



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఎస్టీ హోదా సాధనకు ఉద్యమం ఉధృతం చేస్తామని తెలంగాణ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లేండుగూరి శ్యామ్రావు అన్నారు. కాగజ్నగర్ మండలంలోని తిలక్నగర్ బీసీ భవన్లో సోమవారం తెలంగాణ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంతరావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మోర్లే మొండి, జిల్లా ప్రధాన కార్యదర్శి వడుగూరి సాయిలతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో సంఘం నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. మాలి కులానికి ఎస్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మాలి సంఘ సభ్యులను చైతన్యపర్చాలని, ప్రతి జిల్లా నుంచి అధిక సంఖ్యలో సభ్యులు ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేలా సమన్వయం చేయాలని పిలుపునిచ్చారు. వివిధ జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి హాజరైన ప్రతినిధులు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పలు సూచనలు చేశారు. ఎస్టీ హోదా సాధన లక్ష్యంగా సంఘం సభ్యులందరూ ఐక్యంగా పనిచేయాలని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని తీర్మానించారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, ప్రజా చైతన్య యాత్రలు, ఢిల్లీ నిరసన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. ఉద్యమం విజయవంతానికి ప్రతి సభ్యుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.

# మున్నూరుకాపు కమ్యూనిటీ హాళ్ల కు స్థలం మంజూరు చేయాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మున్నూరుకాపు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని జాతీయ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి అదితకు మున్నూరు కాపు సంఘం (పటేల్స్) నాయకులు వినతిపత్రం సమర్పించారు. సోమవారం కాగజ్నగర్లోని ఆమె నివాసంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ కేంద్రాల్లో ఒక్కోచోట 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్స్ మున్నూరుకాపు సంఘ సభ్యుల సామాజిక, సాంస్కృతిక, విద్యా, యువజన, సంక్షేమ కార్యక్రమాలకు శాశ్వత కేంద్రాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. యువతకు మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సంఘ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. వినతిపై సానుకూలంగా స్పందించిన అదిత సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య, మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి మహేష్, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, సిర్పూర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బొలిశెట్టి అరుణ, అలవాల పెంటన్న, పులిశెట్టి వెంకటేష్, పార్వతి సురేష్, పెద్దింటి హనుమంతు, కారింగుల చంద్రయ్య, సాయిదామ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజావాణి పోర్టల్లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధిహామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 109 ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిపై తక్షణ చర్యలు చేపట్టి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజులలోపు పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత గడువులో ప్రజావాణి పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు వచ్చే పరిస్థితి లేకుండా శాశ్వత పరిష్కారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఏఓ వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయ్బాబు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయ్బాబు అన్నారు. నియోజకవర్గంలోని వేంసూరు మండలం భీమవరం గ్రామంలో సోమవారం పర్యటించారు. గ్రామానికి చెందిన తిరుమలశెట్టి రామకృష్ణ, కుమారి దంపతులు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహాన్ని సందర్శించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన తోట వెంకటేశ్వరరావు దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇదే పర్యటనలో గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకుడు, మువ్వా వర్గీయుడు కవిశెట్టి వేణు కాలికి గాయం కావడంతో ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వేణుకు మనోధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంట్లా రమేష్, ధర్మారావు, కాల్నేని రాజేష్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి మరో బొగ్గు బ్లాక్

## పీ.కే ఓసి–2 డీప్ సైడ్ కేటాయింపు



**ఉద్యమ కెరటం, సత్తు పల్లి :** మణుగూరు ప్రాంతంలోని పీకే ఓసి–2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ను సింగరేణి సంస్థకు కేటాయించడం కార్మికుల ఐక్యతకు, ఐఎన్టీయూసీ చేపట్టిన ఉద్యమానికి దక్కిన విజయమని సత్తుపల్లి పట్టణానికి చెందిన ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ సోమవారం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆగస్టు 1న సింగరేణి వ్యాప్తంగా వేలాది మంది కార్మికులతో నిర్వహించిన ఉద్యమం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. గతంలో తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ను కూడా సింగరేణికే కేటాయించాలని జనక్ ప్రసాద్ నేతృత్వంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు గుర్తు చేశారు. ఆ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం గత నెలలో తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ను సింగరేణికి కేటాయించిందన్నారు. అదేవిధంగా పీకే ఓసి–2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్ను కూడా సింగరేణికే అప్పగించాలని కోరుతూ సంస్థకు కలిగే ప్రయోజనాలు, కేటాయించకపోతే ఎదురయ్యే నష్టాలను కేంద్ర ప్రభుత్వానికి వివరించడంతో సానుకూల నిర్ణయం వెలువడిందని చెప్పారు. ఈ కేటాయింపుతో వేలాది మంది సింగరేణి కార్మికుల ఉద్యోగ భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మణుగూరు ప్రాంతం మరోసారి పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాక్లను సింగరేణి సంస్థకే కేటాయించే వరకు ఐఎన్టీయూసీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని, సింగరేణి సంస్థ బలోపేతం, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు.

# మందబోగుడ గ్రామ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బోథ్ మండలంలోని మందబోగుడ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ పెద్దలు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావును కోరారు. సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడీ భవనం, కమ్యూనిటీ హాల్, దండారి షెడ్డు నిర్మించాలని, ప్రధాన సమస్యగా ఉన్న రహదారి సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సోయం బాపూరావు సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే మందబోగుడ గ్రామాన్ని సందర్శించి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, అందూర్ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, నక్కలవాడా సర్పంచ్ అడప నవీన్ కుమార్, ఎస్టీ సెల్ బోథ్ మండల అధ్యక్షుడు ఉమేష్ జాదవ్, చౌహాన్ దేవిదాస్, లక్ష్మణ్, జలపతి, మాజీ డీసీసీబీ బ్యాంకు చైర్మన్ అడ్డీ భోజా రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# 2వ విడత గృహ నిర్మాణం, లబ్ధిదారుల సమాచార పరిశీలనను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడత గృహ నిర్మాణ పనులు, లబ్ధిదారుల డెస్క్ పరిశీలన, ఫీల్డ్ పరిశీలన ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రకాష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో లబ్ధిదారుల డెస్క్ పరిశీలన ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 10లోపు, కెరమెరి మండలంలో 13 మాత్రమే పెండింగ్‌లో ఉన్నందున మంగళవారం నాటికి డెస్క్ పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. సిర్పూర్-టి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, వాంకిడి, లింగాపూర్, రెబ్బెన తదితర మండలాలలో 100 కంటే తక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున శనివారం సాయంత్రంలోగా తప్పనిసరిగా పరిశీలన పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో లేని అర్హులైన హట్ డ్వెల్లర్స్ ఎవరైనా ఉన్నట్లయితే, వారి వివరాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సేకరించి, ఫోటోలతో సహా నిర్దేశిత ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలలో లబ్ధిదారుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజావాణిలో అందిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ పరిశీలించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 500 రూఫ్ రీప్లేస్‌మెంట్ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని, గోడలు బాగుండి, కేవలం పైకప్పు మార్పిడి అవసరమున్న ఇళ్లను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం




ఆర్.సి. లెవల్‌లో ఉన్న 2 వేల 712 గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, జైనూర్ మండలంలో 369 ఇళ్లు, కాగజ్‌నగర్, కెరమెరి ప్రాంతాలలో అధిక సంఖ్యలో నిర్మాణాలు కొనసాగుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదని, ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదలవుతాయని, ఈ విషయంపై గుత్తేదారులు, లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతంగా పూ ర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డెస్క్ పరిశీలన, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, తప్పుడు వివరాలకు అవకాశం లేకుండా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సహాయ ఇంజనీర్లు (ఏఈలు), ఏపీ వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ఉద్యమ కెరటం, జైనూర్:** రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న "నెల తొలి తేదీకే జీతాలు" విధానంపై గ్రామపంచాయతీ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు, డైలీ వేజ్ వర్కర్లు, మల్టీపర్పస్ వర్కర్లు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో నెలల తరబడి జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. కుటుంబ పోషణ, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, నిత్యావసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉండేవని, సమయానికి జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజా పాలన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రతినెల తొలి తేదీనే జీతాలు అందుతుండటంతో కుటుంబాల్లో ఆర్థిక భరోసా పెరిగిందన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. అనంతరం గ్రామపంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభను ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం ఆమె చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సోయం రాజు, సోనేరావ్, జూగాది రావ్, శ్రీనివాస్, ఉత్తం జ్యోతిరామ్, యమ్మున బాయి, సత్తుబాయి, హెచ్.కే.దేవురావ్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# మానవ మనుగడకు చెట్లే ఆధారం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మానవ మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం అత్యవసరమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు సకాలంలో వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ఈరోజు నాటిన మొక్కలే రేపటి తరాలకు మహా వృక్షాలుగా మారి స్వచ్ఛమైన గాలిని అందిస్తాయని, ఎండాకాలంలో ఉష్ణోగ్రతల తీవ్రతను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని చెప్పారు. పచ్చదనం పెంపొందించేందుకు హరితహారం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మెరుగు లక్ష్మణ్, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కట్కాల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ధం అశోక్, టిపి. ప్రసాద్, వార్డు సభ్యుడు పెరుగు లింగమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంచినీటి బావి ప్లాట్‌ఫారం నిర్మాణానికి భూమిపూజ

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని భారేవాడ 1, 2, 3 వార్డుల ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపర్చాలనే లక్ష్యంతో మంచినీటి బావి ప్లాట్‌ఫారం నిర్మాణ పనులకు సోమవారం తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకుముందు మంచినీటి బావిలో పేరుకుపోయిన పూడికను తొలగించి, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని క్లోరినేషన్ చేయించారు. వర్షాకాలంలో కలుషిత నీటితో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ పనులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు గ్రామపంచాయతీ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కమ్మరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి. ఈసా, వార్డు సభ్యులు ఓడ్నాల రమేష్, పులగం శ్రీకాంత్, నాయకులు సప్ప హరీష్, ఎం.ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా అన్నారు. సోమవారం మండలంలోని మాధాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హోమ్స్టెడ్ ప్లాంటేషన్, ఇంటింటికీ మొక్కల పెంపకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. గ్రామ ప్రజల సహకారంతో మాధాపూర్ను పచ్చని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. నేడు నాటిన మొక్కే రేపటి మానవాళి జీవనాధారమని అనానరు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారమ్ల డిజిటలైజేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులు దొర్లకుండా అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్తో పాటు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదై ఉంటే, వారందరినీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకొచ్చేలా హేతుబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, డీఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# 'సంఘటన్ శ్రీజన్ అభియాన్'తో కాంగ్రెస్ మరింత బలోపేతం

- ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** 'సంఘటన్ శ్రీజన్ అభియాన్'తో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలు, బోథ్ నియోజకవర్గంలోని తాంసి, భీంపూర్ మండలాల్లో సోమవారం విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన మండల కమిటీల నియామకంలో ఎలాంటి వర్గ విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుjuళ్లాలని సూచించారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ పారదర్శకంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈనెల 15లోగా మండల కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి మండల కమిటీలో మండల అధ్యక్షుడితో కలిపి మొత్తం 22 మంది సభ్యులు ఉండేలా చూడాలని, అందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులకు స్థానం కల్పించాలని తెలిపారు. పార్టీ కమిటీల్లో మహిళా నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి ఐక్యత, క్రమశిక్షణ, సమిష్టి కృషి ఎంతో అవసరమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గీమ్మ సంతోష్, మావల మండల అధ్యక్షుడు కుదురుపాక సురేష్, ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు వెంకటి, భీంపూర్ మండల అధ్యక్షుడు సుదర్శన్, తాంసి మండల అధ్యక్షుడు కొడల సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డు నిర్మాణం.. ప్రజాధనం నిర్వీర్యం

- సరండి గ్రామంలో లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- పారిశుద్ధ్య నిర్వహణకు తీవ్ర ఆటంకం

**ఉద్యమ కెరటం, వాంకిడి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో గ్రామ పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చాలనే లక్ష్యంతో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డంపింగ్ యార్డు ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఈ యార్డు, సరైన ప్రణాళిక లేకపోవడంతో మూలన పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు నిర్మాణం పూర్తయి చాలా కాలం గడిచినా, ఇప్పటి వరకు అక్కడ ఒక్క ట్రాక్టర్ చెత్త కూడా వేయలేదని, వేసిన తూతుమంత్రంగా అని చెబుతున్నారు. యార్డుకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గంలో కెనాల్ కాలువ అడ్డుగా ఉండటంతో చెత్త సేకరణ వాహనాలు అక్కడికి చేరుకునే పరిస్థితి లేకుండా పోయింది. కాలువపై వంతెన, కల్వర్టు గానీ లేకపోవడంతో డంపింగ్ యార్డు కేవలం నిర్మాణానికే పరిమితమైపోయింది. గ్రామంలో ప్రతిరోజూ ఇళ్ల నుంచి, దుకాణాల నుంచి, ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున చెత్త వెలువడుతోంది. ఈ చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా, అందుకు అవకాశం లేకపోవడంతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా చెత్తను పేరుకుపోయేలా వేయాల్సి వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. కొన్నిచోట్ల రహదారి పక్కన, మరికొన్ని చోట్ల ఖాళీ స్థలాల్లో చెత్త వేయడంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా గ్రామ సౌందర్యం కూడా దెబ్బతింటోందని చెబుతున్నారు.






### పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతికూల ప్రభావం..

వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. పేరుకుపోయిన చెత్త వర్షపు నీటిలో కలిసిపోవడంతో మురుగు కాలువలు మూసుకుపోతున్నాయని, మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని వాపోతున్నారు. దీంతో దోమలు, ఈగలు, విషపురుగులు పెరిగి ప్రజలు డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు, ఇతర అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను సేకరించిన తర్వాత దాన్ని ఎక్కడ వేయాలనే సమస్య కారిమకులను వెంటాడుతోందని చెబుతున్నారు. డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ ఉపయోగించుకోలేని పరిస్థితి ఉండటంతో తాత్కాలిక ప్రదేశాలను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇది పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపుతోందని అంటున్నారు. డంపింగ్ యార్డు నిర్మాణానికి ముందు సంబంధిత అధికారులు స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అంటున్నారు. యార్డుకు వెళ్లే మార్గం ఉందా..? మధ్యలో కాలువ ఉందా..? వాహనాలు తిరిగేందుకు అవకాశం ఉందా..? వంటి ప్రాథమిక అంశాలను పరిశీలించకుండా నిర్మాణం చేపట్టడంతోనే లక్షల రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని అంటున్నారు.

### వినియోగంలోకి తీసుకురావాలి..

ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛ భారత్ మిషన్, పల్లె ప్రగతి వంటి కార్యక్రమాల ద్వారా భారీగా నిధులు కేటాయిస్తోంది. ప్రతి గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. అయితే సరండి గ్రామంలో మాత్రం నిర్మించిన మౌలికవసతి ప్రజలకు ఉపయోగపడకపోవడం బాధాకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి పనులు కేవలం నిర్మాణాలతో ముగియకుండా, వాటి వినియోగానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినప్పుడే ప్రజాధనం సద్వినియోగం అవుతుందని పేర్కొంటున్నారు. డంపింగ్ యార్డు ప్రస్తుతం పిచ్చిమొక్కలతో కప్పుకుపోయి, ఎవరూ ఉపయోగించని నిర్మాణంగా మారిందని చెబుతున్నారు. సమయానికి వినియోగంలోకి తీసుకురాకపోతే భవిష్యత్తులో నిర్మాణం కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే డంపింగ్ యార్డును సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని, కెనాల్ కాలువపై వంతెన, కల్వర్టు నిర్మించి, శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతున్నారు. అలా చేసినప్పుడే గ్రామంలో చెత్త నిర్వహణ వ్యవస్థ సక్రమంగా అమలై, పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం మాత్రమే కాదు, అవి ప్రజలకు ఉపయోగపడేలా చేయడం కూడా అంతే ముఖ్యమని అంటున్నారు. సరండి గ్రామ డంపింగ్ యార్డు ఉదంతం భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి పనులకు ఒక గుణపాఠంగా నిలవాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుని డంపింగ్ యార్డును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే లక్షల రూపాయలతో నిర్మించిన ఈ డంపింగ్ యార్డు ప్రజాధనం వృథాకు నిదర్శనంగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# బోథ్ గుండెల్లో చెరగని బాపూరావు ముద్ర!

## పవర్ లేకున్నా పాపులారిటీ తగ్గలేదు!

- పార్టీలకతీతంగా లభిస్తున్న అపూర్వ మద్దతు!
- కార్యకర్తల్లో జోష్.. సరికొత్త సమీకరణాలకు నాంది!
- బోథ్ పోరుగడ్డపై రీఎంట్రీ ధమాకా!



రాజకీయ రంగస్థలంలో పదవి ఉంటేనే జనం చుట్టూ తిరుగుతారనేది సాధారణ నానుడి. కానీ, ఆ పదవి దూరమైనప్పటికీ ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకోవడం కొందరికే సాధ్యమవుతుంది. ప్రస్తుతం బోథ్ నియోజకవర్గ రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పరిస్థితి ఇందుకు సరిగ్గా సరిపోతుంది. ప్రస్తుతం ఆయన వద్ద ఎలాంటి పదవి లేకపోయినా, బోథ్ రాజకీయాల్లో ఆయన పేరే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. "రాథోడ్ బాపూరావు రావాలి.. బాపూరావు నాయకత్వం కావాలి" అంటూ నియోజకవర్గంలోని మూలమూలల నుంచి బలంగా వినిపిస్తున్న మాటలు ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

- ఉద్యమ కెరటం, ఆదిలాబాద్

### పవర్ లేకున్నా పాపులారిటీ తగ్గలేదు!

అధికారం ఉన్నప్పుడు అందరూ నాయకులే అవుతారు. కానీ, అధికారం దూరమైన తర్వాత కూడా జనంలో అభిమానం ఏమాత్రం తగ్గకపోవడమే అసలైన నాయకుడి గుర్తింపు. బోథ్ నియోజకవర్గంలో నేడు ఇదే దృశ్యం కనిపిస్తోంది. గతంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తించిన కాలంలో ఆయన చూపిన చొరవ, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించిన వైనం, ప్రతి సాధారణ కార్యకర్తకు అందుబాటులో ఉన్న తీరు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నేడు అదే అనుబంధం ఆయనకు శ్రీరామరక్షగా మారింది.



### పార్టీలకతీతంగా లభిస్తున్న అపూర్వ మద్దతు!

ఆయన అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల కోసం పరితపించే తత్వమే బాపూరావును నేటికీ ప్రజల మధ్య చర్చనీయాంశంగా మార్చిందని అభిమానులు, కేడర్ వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలు ఆయన చేసిన అభివృద్ధిని, సేవను ఎప్పటికీ మరచిపోలేదనడానికి ఇదే నిదర్శనమని, ఏ వర్గం ప్రజలకైనా ఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడని స్థానికులు పేర్కొంటున్నారు.

### కార్యకర్తల్లో జోష్.. సరికొత్త సమీకరణాలకు నాంది!

ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనతో రాథోడ్ బాపూరావు కేడర్‌లో నూతనోత్సాహం ఉరకలేస్తోంది. నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, బాపూరావు పేరు మళ్లీ తెరపైకి రావడం ప్రత్యర్థుల్లో సైతం తీవ్ర గుబులు పుట్టిస్తోంది. గ్రామగ్రామాన కార్యకర్తలు మళ్లీ యాక్టివ్ అవుతుండటంతో నియోజకవర్గ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

### బోథ్ పోరుగడ్డపై రీఎంట్రీ ధమాకా!

పదవి లేకపోయినా ప్రజాబలం చెక్కుచెదరకపోవడం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే కాలంలో ఆయన అనుసరించబోయే వ్యూహాలు ఏమిటి, ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఆయన రీఎంట్రీ బోథ్ రాజకీయాన్ని ఏ మలుపు తిప్పనుంది అనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది. ఏదేమైనా బోథ్ రాజకీయ వేదికపై మాత్రం రాథోడ్ బాపూరావు పేరు మరోసారి భారీ ప్రకంపనలు సృష్టిస్తోందన్నది మరువలేని సత్యం.



# నీరుగారుతున్న 'ప్రజావాణి'?

- అధికారుల అలసత్వానికి అటకెక్కుతున్న ప్రజా సమస్యలు!
- నేరడిగొండలో మొక్కుబడిగా మారిన అర్జీల స్వీకరణ
- జిల్లా అధికారులు స్పందించాలని ప్రజల డిమాండ్

(ఉద్యమ కెరటం, నేరడిగొండ)

ప్రజల సమస్యలను నేరుగా, త్వరితగతిన పరిష్కరించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ప్రజావాణి' కార్యక్రమం నేరడిగొండ మండలంలో లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ఈ అర్జీల స్వీకరణ వేదిక అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా కేవలం ఒక మొక్కుబడి తంతుగా మారుతోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పనులు మానుకుని వస్తే... పత్తాలేని అధికారులు!

మండలంలోని మారుమూల గ్రామాల నుంచి నిరుపేద ప్రజలు తమ రెక్కాడితే గానీ డొక్కాడని పనులను మానుకుని, బస్సు ఛార్జీలు భరించి





ఆశగా మండల కేంద్రానికి వస్తున్నారు. అయితే, అక్కడ అధికారుల తీరు వారి ఆశలపై నీళ్లు చల్లుతోంది. ప్రజావాణికి హాజరుకావాల్సిన మండల స్థాయి కీలక అధికారులు సమావేశానికి రాకపోవడం లేదా తమ స్థానంలో కింది స్థాయి సిబ్బందిని పంపడం సర్వసాధారణంగా మారింది.

### జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి!

ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న 'ప్రజావాణి'ని కొందరు అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల నాశనం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు కచ్చితంగా హాజరయ్యేలా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, ప్రజావాణికి డుమ్మా కొడుతున్న అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నేరడిగొండ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి
# సహకారం అందిస్తా : విప్ వేముల

**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశంను శాసనసభ ఆవరణలోని ఆయన కార్యాలయంలో చిన్న దినపత్రికల సంఘం రాష్ట్ర నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి వై.ఎల్ అశోక్, కోశాధికారి ఆజంఖాన్, ఉపాధ్యక్షుడు గోళ్ళ రమేష్ శాలువాతో సన్మానించారు. రాజకీయాలలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్న, మధ్యతరహా పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు వీరేశం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రకటనలను చిన్న పత్రికలకు ఇచ్చేలా చూడాలని, కేటాయింపులో పారదర్శకత పాటించడం, పెండింగ్ బిల్లులను సకాలంలో విడుదల చేయడం, చిన్న పత్రికల ప్రతినిధులకు అసెంబ్లీ పాస్‌లు మంజూరు చేయడం, చిన్న పత్రికల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. వినతులను శ్రద్ధగా ఆలకించిన ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, చిన్న, మధ్యతరహా పత్రికలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సంఘం తన దృష్టికి తీదుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMURAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717

# గ్లాస్గోలో ముగిసిన కామన్వెల్త్ క్రీడలు





**గ్లాస్గో, ఆగస్టు 4 (ఉద్యమ కెరటం):** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన కామన్వెల్త్ క్రీడలు-2026 ఆదివారం ముగిశాయి. జూలై 23న ప్రారంభమైన ఈ బహుళ క్రీడల మహోత్సవం ముగింపు వేడుకలతో తెరపడింది. ఈసారి బడ్జెట్ పరిమితుల కారణంగా కేవలం 10 క్రీడా విభాగాల్లోనే పోటీలు నిర్వహించినప్పటికీ, 74 దేశాలకు చెందిన వేలాది మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. భారత అథ్లెట్లు మరోసారి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుతూ మొత్తం 39 పతకాలు సాధించారు. ఇందులో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో భారత్ పతకాల పట్టికలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, కెనడాల తర్వాత నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో భారత్ 61 పతకాలు సాధించినప్పటికీ, ఈసారి పతకాల సంఖ్య తగ్గింది. అయితే దీనికి ప్రధాన కారణం షూటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీ వంటి భారత్‌కు సంప్రదాయంగా ఎక్కువ పతకాలు అందించే క్రీడలను ఈ ఎడిషన్ నుంచి తొలగించడమేనని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. పరిమిత అవకాశాల్లోనూ భారత క్రీడాకారులు అద్భుత పోరాట పటిమ కనబరిచారు. ముఖ్యంగా మహిళా అథ్లెట్లు స్వర్ణ పతకాల వేటలో కీలక పాత్ర పోషించి భారత్‌కు గర్వకారణంగా నిలిచారు. కామన్వెల్త్ క్రీడలు ముగియడంతో భారత క్రీడాకారుల దృష్టి ఇప్పుడు ఆసియా క్రీడలపై కేంద్రీకృతమైంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో కూడా ఇదే జోరు కొనసాగించాలని భారత బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇక 2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక క్రీడలకు వేదిక కానుంది. 2010లో ఢిల్లీలో విజయవంతంగా కామన్వెల్త్ క్రీడలను నిర్వహించిన భారత్, రెండోసారి ఈ మహోత్సవానికి ఆతిథ్యం ఇవ్వనున్న దేశంగా నిలవనుంది. ఆస్ట్రేలియా తర్వాత కామన్వెల్త్ క్రీడలను రెండుసార్లు నిర్వహిస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. గ్లాస్గోలో జరిగిన బాధ్యతల బదిలీ కార్యక్రమంలో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవీ భారత తరఫున కామన్వెల్త్ జెండా, బ్యాటన్‌ను స్వీకరించారు. దీంతో ప్రపంచ క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు అహ్మదాబాద్‌లో జరగనున్న 2030 కామన్వెల్త్ క్రీడలపై పడింది.

**39 పతకాలతో భారత్‌కు నాలుగో స్థానం**

- 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు సాధించిన భారత అథ్లెట్లు
- 2030 కామన్వెల్త్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం.. బాధ్యతల బదిలీ పూర్తి



# మ్యాచ్ ఫిక్సింగ్.. ఐసీసీ కొరడా



**భారత సంతతి ఆటగాడు అఖిలేష్ రెడ్డికి ఎనిమిదేళ్ల నిషేధం**

**అబుదాబి టీ10 టోర్నీలో అవినీతి నిరోధక నిబంధనల ఉల్లంఘన**

**చాట్‌లు, కాల్ రికార్డులు తొలగించినందుకూ అదనపు చర్యలు**

**దుబాయ్/హైదరాబాద్, ఆగస్టు 3 (ఉద్యమ కెరటం):** అమెరికా తరఫున ఆడుతున్న భారత సంతతి క్రికెటర్ బొడుగుమ్ అఖిలేష్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కఠిన చర్యలు తీసుకుంది. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై ఎనిమిదేళ్లపాటు అన్ని రకాల క్రికెట్ నుంచి నిషేధం విధించింది. ఈ నిషేధం 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని, 2033 నవంబర్ వరకు కొనసాగుతుందని ఐసీసీ వెల్లడించింది. హైదరాబాద్‌లో పెరిగిన 26 ఏళ్ల అఖిలేష్ రెడ్డి కుడిచేతి బ్యాటర్, ఆఫ్‌స్పిన్ బౌలర్. 2025లో అమెరికా జాతీయ జట్టు తరఫున నాలుగు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అయితే 2025 అబుదాబి టీ10 టోర్నీ సందర్భంగా ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలింది. ఐసీసీ యాంటీ కరప్షన్ ట్రిబ్యునల్ నివేదిక ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని లేదా మ్యాచ్‌లోని ఇతర అంశాలను అక్రమంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం ద్వారా అవినీతి నిరోధక కోడ్‌లోని నిబంధనలను ఉల్లంఘించాడు. అలాగే మ్యాచ్ ఫిక్సింగ్‌లో పాల్గొనాలని మరో ఆటగాడిని ప్రోత్సహించడం, ప్రేరేపించడం కూడా నిర్ధారణ అయింది. దర్యాప్తు ప్రారంభమైన తర్వాత తన మొబైల్ ఫోన్‌లోని చాట్‌లు, కాల్ రికార్డులు, ఇతర డేటాను తొలగించి విచారణకు ఆటంకం కలిగించినట్లు కూడా ట్రిబ్యునల్ గుర్తించింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ అతడిపై సుదీర్ఘ నిషేధాన్ని విధించింది. ఈ శిక్షతో అఖిలేష్ రెడ్డి క్రికెట్ కెరీర్‌కు దాదాపు ముగింపు పలికినట్టేనని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనల ఉల్లంఘనకు గురై దీర్ఘకాల నిషేధం ఎదుర్కొన్న అమెరికా రెండో అంతర్జాతీయ క్రికెటర్‌గా అఖిలేష్ రెడ్డి నిలిచాడు. క్రికెట్‌లో పారదర్శకత, నిష్పాక్షికతను కాపాడేందుకు అవినీతి నిరోధక నిబంధనలను అత్యంత కఠినంగా అమలు చేస్తామని ఐసీసీ మరోసారి స్పష్టం చేసింది.

# మహిళల ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన




**హర్మన్‌ప్రీత్‌కే కెప్టెన్సీ.. స్మృతి మందానా వైస్ కెప్టెన్**

**గాయం కారణంగా శ్రేయాంకకు దక్కని చోటు**

**స్టార్ ఆటగాళ్లతో టైటిల్ ఫేవరెట్‌గా బరిలో టీమిండియా**

**ముంబై, ఆగస్టు 3 (ఉద్యమ కెరటం):** మహిళల ఆసియా కప్--2026 టోర్నీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం భారత జట్టును ప్రకటించింది. అనుభవజ్ఞురాలైన హర్మన్‌ప్రీత్ కౌర్ మరోసారి జట్టుకు కెప్టెన్‌గా కొనసాగనుండగా, స్టార్ ఓపెనర్ స్మృతి మందానా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనుంది. అనుభవం, యువ ప్రతిభ కలయికతో కూడిన జట్టును ఎంపిక చేయడంతో ఈసారి కూడా భారత్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. జట్టులో షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్, దీప్తి శర్మ, రాధా యాదవ్ వంటి కీలక ఆటగాళ్లకు చోటు లభించింది. వికెట్‌కీపర్లుగా రిచా ఘోష్‌తో పాటు జి. కమలినిని ఎంపిక చేశారు. అయితే యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్‌కు ఈసారి నిరాశ ఎదురైంది. చీలమండ లిగమెంట్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆమెను జట్టుకు దూరంగా ఉంచారు. ఇదే గాయం కారణంగా గతంలో టీ20 ప్రపంచకప్‌ను కూడా ఆమె మధ్యలోనే వీడాల్సి వచ్చింది. అయితే సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల నాటికి పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మహిళల ఆసియా కప్-2026 షెడ్యూల్‌ను ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ మధ్య వరకు టోర్నీ నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు ఆసియా క్రీడల మహిళల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. రిజర్వ్ జాబితాలో ప్రతీకా రావల్, ఉమా చేత్రీ, వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేయడం జట్టుకు అదనపు బలంగా మారనుంది. భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మందానా (వైస్ కెప్టెన్), షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), దీప్తి శర్మ, రాధా యాదవ్, ప్రేమా రావత్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్, ఎన్. శ్రీ చరణి, నందిని శర్మ.

**రిజర్వ్ ఆటగాళ్లు:** ప్రతీకా రావల్, ఉమా చేత్రీ (వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి.



# బ్రిజ్ భూషణ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

**లైంగిక వేధింపుల కేసులో నిర్దోషిగా తీర్పు**

**డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌కూ విముక్తి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఉద్యమ కెరటం):** భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించిన కేసులో బ్రిజ్ భూషణ్‌తో పాటు డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌ను ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశ్వినీ పన్వార్ విచారణ అనంతరం ఈ తీర్పు వెలువరించారు. గురువారం వాదనలు పూర్తయిన తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం తాజాగా ఇద్దరికీ విముక్తి కల్పించింది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదుల ఆధారంగా ఢిల్లీ పోలీసులు 2023 జూన్‌లో బ్రిజ్ భూషణ్‌పై ఐపీసీ సెక్షన్లు 354, 354ఏ, 354డీ, 506 కింద అభియోగపత్రం దాఖలు చేశారు. అనంతరం 2024 మేలో లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపుల కేసుల్లో అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అయితే ఒక ఫిర్యాదుదారు చేసిన ఆరోపణల విషయంలో అప్పుడే ఉపశమనం లభించగా, మిగిలిన కేసులపై విచారణ కొనసాగింది. విచారణ కాలమంతా బ్రిజ్ భూషణ్, వినోద్ తోమర్ బెయిల్‌పై ఉన్నారు. మూడేళ్ల క్రితం పలువురు ప్రముఖ భారత మహిళా రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ చేపట్టిన ఆందోళనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయనను అరెస్టు చేయాలంటూ జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలు జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించాయి. తాజా తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, తాను ఎలాంటి తప్పు చేయలేదని మొదటి నుంచే చెబుతున్నానని అన్నారు. తనపై కుట్ర జరిగిందని, నిజం చివరకు న్యాయస్థానం ముందు వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించడం తనకు, తన కుటుంబ సభ్యులకు, మద్దతుదారులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. జూనియర్ అథ్లెట్ల హక్కుల పరిరక్షణ కోసం తాము కృషి కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# శ్రీలంకతో టీమిండియా కొత్త టెస్ట్ మిషన్

- డబ్ల్యూటీసీ ఫైనల్ రేసే లక్ష్యం
- ఆగస్టు 15 నుంచి శ్రీలంక పర్యటన.. భారత్‌కు కీలక సిరీస్
- మిగిలిన 9 టెస్టుల్లో కనీసం 7 విజయాలు అవసరమన్న విశ్లేషకులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఉద్యమ కెరటం):** జింబాబ్వే పర్యటన అనంతరం స్వల్ప విరామం తీసుకున్న భారత క్రికెట్ జట్టు ఇప్పుడు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)పై పూర్తిగా దృష్టి సారించింది. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటనతో టీమిండియా కొత్త టెస్ట్ మిషన్‌కు శ్రీకారం చుట్టనుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్ భారత్‌కు అత్యంత కీలకంగా మారింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. జట్టు ఖాతాలో ఇంకా తొమ్మిది టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఇందులో శ్రీలంకతో రెండు, న్యూజిలాండ్ పర్యటనలో రెండు, ఆస్ట్రేలియాతో స్వదేశంలో ఐదు టెస్టులు ఉన్నాయి. ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ తొమ్మిది మ్యాచ్‌ల్లో కనీసం ఏడు నుంచి ఎనిమిది విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు పట్టికలో ముందంజలో కొనసాగుతున్నాయి. ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్ హయాంలో టీమిండియా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో ఆయన కోచింగ్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ వికెట్‌కీపర్, క్రికెట్ వ్యాఖ్యాత దీప్ దాస్‌గుప్తా స్పందిస్తూ గంభీర్‌కు ఇది కీలక పరీక్ష అని వ్యాఖ్యానించారు. జట్టు ఆశించిన స్థాయిలో రాణించనప్పుడు కోచ్, కెప్టెన్, మేనేజ్‌మెంట్‌పై ప్రశ్నలు రావడం సహజమేనని అన్నారు. గత మూడు టెస్టు సిరీస్‌ల్లో రెండింటిని కోల్పోయిన నేపథ్యంలో ఒత్తిడి ఉండటం సహజమే అయినప్పటికీ, గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు భారత ఆటగాళ్లకు ఆ ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. జట్టులో జరుగుతున్న మార్పులపై కూడా దాస్‌గుప్తా సందేహాలు వ్యక్తం చేశారు. న్యూజిలాండ్ టెస్టు సిరీస్ నుంచి మార్పుల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, అవి ఏ దిశగా సాగుతున్నాయనే విషయంలో స్పష్టత కనిపించడం లేదన్నారు. శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనలు ఎప్పుడూ కఠిన సవాళ్లేనని, ప్రస్తుత పరిస్థితుల్లో ఏ టెస్టు సిరీస్‌ను కూడా తేలికగా తీసుకునే అవకాశం లేదని ఆయన హెచ్చరించారు. మిగిలిన తొమ్మిది టెస్టుల్లో కనీసం ఏడు విజయాలు సాధించడం టీమిండియాకు పెద్ద సవాలేనని ఆయన అభిప్రాయపడ్డారు.




# 'ఇరుముడి' నుంచి 'యాలాలో.. యాలాలో' విడుదల

## ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు 'ఇరుముడి'

**హైదరాబాద్, ఆగస్టు 3 (ఉద్యమ కెరటం:** మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఇరుముడి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ భావోద్వేగ కుటుంబ కథా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా చిత్రం నుంచి రెండో గీతం 'యాలాలో.. యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..'ను విడుదల చేసింది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, ఆప్యాయత, భావోద్వేగాలను ఆవిష్కరించే ఈ మెలోడీ తొలి వినికిడిలోనే సంగీతాభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని తాకే సాహిత్యాన్ని అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మధురమైన స్వరాలతో పాటకు మరింత అందాన్ని చేకూర్చారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో కనిపించిన ఆప్యాయ దృశ్యాలు సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా విశేష ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో.. యాలాలో'తో చిత్రంపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో రవితేజ ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రీ-కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంటుందని తెలిపింది. తన కుమార్తె కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి భావోద్వేగ ప్రయాణాన్ని ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా చిత్రబృందం తెరదించింది. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేసింది. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రం రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'టాక్సిక్' పాటపై ట్రోలింగ్

## కియారాకు హుమా అండ

- మహిళలనే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు?
- యశ్‌పై మౌనం.. కియారాపై విమర్శలు ద్వంద్వ వైఖరి: హుమా ఖురేషి
- 'ఆగస్టు 26న సినిమా చూసి సమాధానం చెప్పండి'





**ముంబై, ఆగస్టు 3(ఉద్యమ కెరటం):** రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా, గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'టాక్సిక్' విడుదలకు ముందే చర్చనీయాంశమైంది. ఇటీవల విడుదలైన 'తబాహీ' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించినప్పటికీ, అందులో యశ్, కియారా అద్వానీ మధ్య చిత్రీకరించిన కొన్ని సన్నిహిత సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. పాట విడుదలైన తర్వాత వివాహిత, ఇటీవల తల్లిగా మారిన కియారా అద్వానీ ఇలాంటి సన్నివేశాల్లో నటించడంపై కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. కొందరు ఆమె భర్త సిద్ధార్థ్ మల్హోత్రా సామాజిక మాధ్యమాల ఖాతాల్లో కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వివాదం మరింత ముదిరింది. అయితే ఇదే పాటలో నటించిన యశ్ కూడా వివాహితుడు, ఇద్దరు పిల్లల తండ్రి అయినప్పటికీ ఆయనపై ఎలాంటి విమర్శలు రాకపోవడాన్ని సినీ వర్గాలు ద్వంద్వ వైఖరిగా అభివర్ణిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన నటి హుమా ఖురేషి, మహిళలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శించడం బాధాకరమని అన్నారు. పాత్రలో భాగంగా నటించిన సన్నివేశాలను వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి తీర్పులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. ఇలాంటి ట్రోలింగ్‌కు ప్రత్యేకంగా సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ఆగస్టు 26న విడుదలయ్యే 'టాక్సిక్' సినిమానే అందరికీ సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. హుమా ఖురేషి వ్యాఖ్యలకు నటుడు సాకిబ్ సలీమ్ మద్దతు పలికారు. సోషల్ మీడియాలో నటీనటుల వ్యక్తిగత జీవితాలపై తీర్పులు ఇవ్వడం ప్రమాదకర ధోరణి అని పేర్కొన్నారు. బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ గారెట్ కూడా స్పందిస్తూ, యశ్‌ను విమర్శించకుండా కియారాను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సమాజంలో ఇంకా కొనసాగుతున్న లింగ వివక్షకు నిదర్శనమని అన్నారు. నటీనటులు తమ వృత్తిలో భాగంగా పాత్రలను పోషిస్తారని, వాటిని వారి వ్యక్తిగత జీవితాలతో ముడిపెట్టకూడదని సూచించారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో యశ్ సరసన కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.




# ఎల్లమ్మలో పర్శిగా దేవిశ్రీప్రసాద్ లుక్ విడుదల

దిల్ రాజు సమర్పణలో, 'రాక్‌స్టార్' దేవి శ్రీ ప్రసాద్, వేణు యెల్దండి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' నుంచి పర్శిగా దేవి శ్రీ ప్రసాద్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. బలగంతో క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు వేణు యెల్దండి మరో ప్రతిష్టాత్మక చిత్రం ఎల్లమ్మను నిర్మిస్తున్నాడు. గతకొంతకాలంగా ఎల్లమ్మపై అనేక ఊహాగానాలకు తెరదించుతూ.. దేవిశ్రీప్రసాదన్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఇందులో పర్శిగా అతను లుక్‌ను విడుదల చేశారు.

# అతీంద్రియ శక్తుల కథ.. అగధ




## 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవు తోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# స్పైడర్ మ్యాన్ కెలక్షన్ల దూకుడు

టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లలకు పైగా వసూళ్లు చేసినట్లు టీమ్ పేర్కొంది. ఇప్పటి వరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతిపెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ.2,100కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బ్జడెట్‌ను అధిగమించి భారీ విజయాన్ని నమోదు చేసింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్: ది ఎండ్‌గేమ్' (1.2 బిలియన్ డాలర్లు) (రూ.11వేల కోట్లు) వసూళ్లు చేసి దీని కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా తెరకెక్కిన 'స్పైడర్ మ్యాన్'కు ఇండియాలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ ఈ చిత్రానికి రూ.310కోట్లు వచ్చినట్లు మూవీ టీమ్ వెల్లడించింది. ఇక ఈ డిసెంబర్‌లో మార్వెల్ స్టూడియోస్ నుంచి రానున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే'కు ముందు ఈ 'స్పైడర్ మ్యాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో భారీ ఉత్సాహం నెలకొంది.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**